సాక్షి
సంగారెడ్డి
బుధవారం । 5 । మార్చి । 2025





**అగ్గి రాజుకుంటే బుగ్గేనా...**
జిల్లా వ్యాప్తంగా అగ్నిమాపక కేంద్రాలు అరకొర వసతులతో కొట్టుమిట్టాడుతున్నాయి.
వివరాలు 8లో ▶



**రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి**
మెదక్ జిల్లా అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలిద్దరూ దుర్మరణం పాలయ్యారు.
వివరాలు 8లో ▶




## న్యూస్‌రీల్

### రూ.2 లక్షల రుణమాఫీ వెంటనే చేయాలి

రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజు



వినతి పత్రం ఇస్తున్న నాయకులు

సంగారెడ్డి: అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ వెంటనే చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు లీడ్ బ్యాంక్ మేనేజర్ గోపాల్‌రెడ్డి కి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ...గ్రామీణ బ్యాంక్‌లో మంజూరైన రుణమాఫీ కూడా రావటం లేదన్నారు. జిల్లాలో సుమారు 600 మంది వరకు గ్రామీణ బ్యాంక్ పేరు మారటంతో రుణమాఫీ కాలేదని, వెంటనే ఆ ప్రక్రియను పూర్తిచేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, జైపాల్‌రెడ్డి, బసప్ప, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

### సృజనకు పదును టెక్‌ఫెస్ట్

జెన్‌కో ఏడీ సౌజన్య



విద్యార్థులతో జెన్‌కో ఏడీ సౌజన్య

సంగారెడ్డి: విద్యార్థుల్లోని సృజనాత్మకతకు పదును పెట్టేందుకు ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 'సృజన టెక్ ఫెస్ట్'లు నిర్వహిస్తున్నట్లు జెన్‌కో ఏడీ సౌజన్య తెలిపారు. శివమ్‌పేట పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన టెక్‌ఫెస్ట్ కు ఆమె హాజరై మాట్లాడారు. జిల్లాలోని సంగారెడ్డి , ఇస్మాయిల్ ఖాన్ పేట ,శివమ్ పేట ,జోగిపేట అన్ని కళాశాలల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో జిల్లా స్థాయి పోటీలకు జడ్జ్‌గా రావడం ఆనందంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు అపర్ణ, సిబ్బంది, ఆయా కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ఉచితన్యాయం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేశ్

సదాశివపేట(సంగారెడ్డి): విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేశ్ పేర్కొన్నారు. సదాశివపేటలోని మంగళవారం మహాత్మజ్యోతిబాపూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో ఉమెన్స్ డే వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విద్యార్థులు క్రమశిక్షణతో చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలికలు చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.

### దర్గా దర్శనకు వచ్చి..

చెరువులో మునిగి ఇద్దరు వ్యక్తులు మృతి



సంజయ్ కాంబ్లే

న్యాల్‌కల్(జహీరాబాద్): చెరువులో స్నానానికి వెళ్లి ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఈ సంఘటన న్యాల్‌కల్ మండలం గంగ్వార్ గ్రామశివారులో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ హన్మంత్ కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన రహిమతుల్లా కుటుంబ సభ్యులతో కలసి గంగ్వార్ సమీపంలోని ముల్తానీ బాబా దర్గాకు వచ్చారు. స్నానాలు చేసేందుకు సమీప చెరువులోకి ఫైజల్(18), సంజయ్ కాంబ్లే(45) దిగారు. ఫైజల్ ముందు వెళ్తుండగా సంజయ్ కాంబ్లే ఆయన వెనకాలే వెళ్లాడు. చెరువులోకి కొంత దూరం వెళ్లే సరికి ఫైజల్ గుంతలో పడి మునిగిపోయాడు. గమనించిన సంజయ్.. ఫైజల్‌ను కాపాడేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఆయన కూడా నీటిలో మునిగిపోయాడు. ఇది గమనించి తండ్రి రహిమతుల్లా వారిని కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. కళ్లెదుటే ఇద్దరు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. విషయం తెలుసుకున్న సీఐ హన్మంత్, హద్నూర్ ఎస్‌ఐ రాజశేఖర్ ఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చేపట్టారు. అందులో సంజయ్ కాంబ్లే మృతదేహం లభ్యం కాగా ఫైజల్ మృతదేహం లభ్యం కాలేదు. చీకటి పడటంతో గాలింపు చర్యలు నిలిపేసినట్లు సీఐ తెలిపారు. బుధవారం ఉదయం గాలింపు చేపడుతామని అంతవరకు ఎవరు చెరువులోకి వెళ్లొద్దని ఆదేశించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

# గప్‌చుప్‌గా పూడ్చివేత!

- సమాచారం ఇవ్వడం లేదంటున్న అధికారులు
- చనిపోయిన వాటి నమూనాల సేకరణలో ఇబ్బందులు

**పలు చోట్ల కోళ్ల ఫారాల్లో వందల్లో కోళ్లు మృత్యువాత**



కోళ్ల ఫారాన్ని పరిశీలిస్తున్న అధికారులు. చనిపోయిన కోళ్లను పూడ్చిపెడుతున్న దృశ్యం (ఫైల్)

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: హత్నూర మండలంలో ఓ పౌల్ట్రీ ఫామ్‌లో రోజూ వందల్లో కోళ్లు మృత్యువాత పడ్డాయి. చనిపోయిన కోళ్ల నమూనాలను సేకరించేందుకు పశుసంవర్ధకశాఖ అధికారులు అక్కడికి వెళ్లేలోపే ఫామ్ యాజమాన్యం చనిపోయిన వాటిని గప్‌చుప్‌గా పూడ్చేసి.. ఫామ్ మొత్తాన్ని శుభ్రం చేసి పెట్టేశారు. దీంతో శాంపిళ్లు సేకరించకుండానే అధికారులు వెనుదిరగాల్సి వచ్చింది. ఇలా జిల్లాలో పలుచోట్ల ఉన్న ఫారాల్లో కోళ్లు మృత్యువాత పడుతుంటే తమకు కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదని పశుసంవర్ధకశాఖ అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ వ్యాపించకుండా ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. పశుసంవర్ధకశాఖ అధికారులు తమ విధుల్లో భాగంగా వివిధ కోళ్ల ఫారాలను పరిశీలించేందుకు వెళ్తుంటారు. అయితే ఆ అధికారులు, సిబ్బంది తమ ఫారాలకు వస్తే ఏదైనా వైరస్ అంటుకుంటుందనే భయంతో అధికారులకు సమాచారం ఇవ్వడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**అసాధారణ మరణాలుంటే....**

కోళ్ల ఫారాల్లో అసాధారణ స్థాయిలో కోళ్ల మరణాలుంటే తమకు సమాచారం ఇవ్వాలని అధికారులు ఇప్పటికే ప్రకటించారు. అయితే జిల్లాలో పలు కోళ్ల ఫారాలను ఆయా పౌల్ట్రీ కంపెనీలే ఎక్కువగా లీజుకు తీసుకున్నాయి. ఆయా కంపెనీలే కోడి పిల్లలను సరఫరా చేస్తున్నాయి. వాటికి అవసరమైన దాణా, మందులు సరఫరా చేస్తున్నాయి. వాటి పెరుగుదలపై ఆయా కంపెనీల ప్రతినిధులే పర్యవేక్షిస్తున్నారు. ఇలా కోళ్లను పెంచినందుకుగాను రైతుకు నిర్ణీత మొత్తాన్ని చెల్లిస్తున్నాయి. అయితే కోళ్లు చనిపోయినప్పుడు రైతులు ఆయా కంపెనీల ప్రతినిధుల సూచనల మేరకే నడుచుకుంటున్నారని పశుసంవర్ధకశాఖ అధికారులు చెబుతున్నారు. కాగా, చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం గ్రామంలోని కోళ్ల ఫారంలోనూ వందల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడ్డాయి. అక్కడికి వెళ్లిన అధికారులు శాంపిళ్లను సేకరించి వీబీఆర్ఐ (వెటర్నరీ బయలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్)కి పంపారు.

**వ్యాపించకుండా ముందుజాగ్రత్త చర్యలు..**

మండలానికి ఒకటి చొప్పున పశుసంవర్ధశాఖ అధికారులు రెస్క్యూ టీంలను నియమించారు. సరిహద్దుల్లో కర్ణాటక, మహారాష్ట్రలనుంచి కోళ్లు తెలంగాణకు రాకుండా సరిహద్దుల్లో చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు కూడా చేస్తున్నారు. మరోవైపు జిల్లాలో ఉన్న కోళ్ల ఫారాల యజమానులకు అవగాహన కూడా కల్పించారు. అసాధారణ స్థాయిలో మరణాలుంటే సమాచారం ఇవ్వాలని సూచించారు. కానీ చాలా వరకు ఈ సమాచారం అధికారులకు చేరడం లేదు.

**కచ్చితంగా సమాచారం ఇవ్వాలి**

నాలుగైదు శాతం కోళ్లు మరణించడం సాధారణమే. కానీ, పది నుంచి 20 శాతం కోళ్లు ఒక్కసారిగా మరణిస్తే తప్పకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. అసాధారణ మరణాలుంటే తమకు సమాచారం ఇవ్వాలని కోరినప్పటికీ కొన్ని ఫారాల యాజమాన్యాలు సమాచారం ఇవ్వడం లేదు.

–డాక్టర్.హేమలత, పశుసంవర్ధకశాఖ, హత్నూర మండలం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

## ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలి

- కలెక్టర్ వల్లూరు క్రాంతి
- అధికారులతో సమీక్ష

సంగారెడ్డి జోన్: జిల్లాలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించేలా మార్కింగ్ చేసి ఇవ్వాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం 1,36,821మంది అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీల్లో ఎల్ఆర్ఎస్ డబ్బుల బ్యాలన్స్ త్వరగా వసూలు చేయాలని ఆదేశించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని గ్రామాలలో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. గ్రామీణాభివృద్ధి సంస్థ ఉపాధిహామీ పథకం ఆధ్వర్యంలో గ్రామాలలో ప్రతీరోజు కనీసం 60 మందికి కొత్త పనులు ఉపాధి కల్పించేలా పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈసారి ఎండలు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, జెడ్పీసీఈవో జానకీరెడ్డి, డీపీవో సాయిబాబా, పీడీ హౌజింగ్ చలపతి రావు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనిదినాలు పెంచాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నర్సింలు

కొండాపూర్(సంగారెడ్డి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పని దినాలను 200 రోజులకు పెంచడంతోపాటు రోజు కూలీ రూ.600 లకు పెంచాలనీ సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నర్సింలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రం కొండాపూర్‌లోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధి పనుల్లో భాగంగా పని ప్రదేశాల్లో ప్రమాదవశాత్తు మరణించిన కూలీలకు రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రాజయ్య, మండల కమిటీ సభ్యులు బాబురావు, నరసింహారెడ్డి, ప్రవీణ్ కుమార్, ఆసిఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ.. సౌకర్యాలు లేవేమి

- పని ప్రదేశంలో కానరాని కనీస సౌకర్యాలు
- ఎండలో ఇబ్బంది పడుతున్న కూలీలు



మక్త అల్లూరులో ఎండలోనే పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

కంది(సంగారెడ్డి): వలసలను నివారించేందుకు ఏర్పాటైన ఉపాధి హామీపథకంలో పని చేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఉపాధి హామీ చట్టం ప్రకారం పని ప్రదేశంలో కూలీలకు నిలువనీడ కల్పించడంతోపాటు తాగు నీరు, ప్రథమ చికిత్స కిట్లు అందజేయాల్సి ఉన్నా అవి అమలుకు నోచు కోవడంలేదు. దీంతో కూలీలు ఎండలో అవస్థలు పడుతున్నారు. వేసవిలో కూలీలకు పని ప్రదేశంలో సేద తీరేందుకు నీడ కల్పించాల్సి ఉండగా, ఏ గ్రామంలోనూ ఈ ఏర్పాట్లు చేయడం లేదు. దీంతో అక్కడక్కడా ఉన్న చెట్ల కిందే కూలీలు సేద తీరుతున్నారు. చెట్లు లేనిచోట ఎండలోనే కూర్చుని సేద తీర్చుకుంటున్నారు. ఇక పని ప్రదేశాల్లో కూలీలు గాయపడితే వారికి ప్రథమ చికిత్స చేసేందుకు మెడికల్ కిట్లను గతంలో అందుబాటులో ఉంచే వారు. ప్రస్తుతం వాటి జాడ కూడా లేదు. ఉపాధి హామీ పథకంలో ప్రస్తుతం రైతుల పొలాల్లో పాండ్లు, కందకాల తవ్వకాలు కొనసాగుతున్నాయి. మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో సుమారు మూడు వేల మంది ఉపాధి కూలీలున్నారు. చాలా రోజుల నుంచి పనిముట్లు కూడ ఇవ్వడం లేదని కూలీలు చెబుతున్నారు. అధికారులు స్పందించి ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కూలీలు విజ్ఞప్తి చేస్తున్నారు.

**పంచాయతీలే సమకూర్చాలి**



కూలీలకు పని ప్రదేశాల్లో నీడ, తాగునీరు అందించడం వంటి సౌకర్యాలను గ్రామపంచాయతీలే కల్పించాలి. గతమూడేళ్ల నుంచి పనిముట్లు రాలేదు. కూలీలకు పని ముట్ల డబ్బులు అదనంగా వస్తాయి. గ్రామపంచాయతీల సహకారంతో సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తాం.

–గురుపాదం, ఏపీవో, కంది.

## 'సృజన' రాష్ట్రస్థాయి పోటీలకు రెండు ప్రాజెక్టులు

- జిల్లా స్థాయి పోటీల్లో ఐదు ప్రాజెక్టులు ప్రదర్శన
- మల్టీపర్పస్ అగ్రికల్చర్ మెషీన్‌కు ప్రథమ బహుమతి
- ఫైర్ ఫైటర్ రోబోట్‌కు ద్వితీయ బహుమతి



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన మల్టీపర్పస్ అగ్రికల్చర్ మెషీన్ ప్రయోగం



360 డిగ్రీ ఫైర్ ఫైటర్ రోబోట్ ప్రయోగం

జహీరాబాద్: జహీరాబాద్ మండలం రంజోల్ గ్రామంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన సృజన జిల్లా స్థాయి 'టెక్ ఫెస్ట్'లో రెండు ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. జిల్లాలోని జహీరాబాద్, చేగుంట, జోగిపేట, గజ్వేల్, నర్సాపూర్ లలోని పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన విద్యార్థులకు ఆటోమొబైల్ అంశంపై టెక్ ఫెస్ట్ నిర్వహించారు. ప్రతీ కళాశాల నుంచి ఒక్కో అంశాన్ని ఎంపిక చేసి ప్రదర్శించారు. చేగుంట కళాశాలకు చెందిన విద్యార్థులు సోలార్ పవర్డ్–స్మార్ట్ బ్లూటూత్ ఆపరేటెడ్ మల్టీ పర్పస్ అగ్రికల్చర్ యంత్రాన్ని ప్రదర్శించారు. ఈ ప్రదర్శనకు ప్రథమ బహుమతి లభించింది. దీన్ని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. సోలార్‌తో నడుస్తూ దున్నడం, విత్తనాలు వేయడం, భూమిని చదును చేయడంతోపాటు రసాయన మందులను పిచికారీ చేయడం వంటి పనులను ఏకకాలంలో చేసే విధంగా రూపొందించారు. ఈ యంత్రంతో ఏ పని అవసరముంటే దాన్ని చేసుకునే విధంగా తయారు చేశారు. పూర్తిగా సౌరశక్తితో పనిచేసే ఈ యంత్రం వర్షాకాలంలో బ్యాటరీ సహాయంతో కూడా నడిచే విధంగా రూపొందించారు. దీంతో ఎలాంటి కాలుష్యం వెలువడదు. గైడ్ శోభ పర్యవేక్షణలో విద్యార్థులు ఎం.డి.ఫౌజన్, మనోజ్‌వర్ధన్, తాత్విక్, హేమంత్, నిఖిల్‌లు ప్రాజెక్టును రూపొందించారు.

**ఫైర్ ఫైటర్ రోబోట్...**

అగ్నిప్రమాదంలో మంటలు అదుపుచేసేందుకు వీలుగా రిమోట్ సహాయంతో పనిచేసే ఫైర్ ఇంజన్‌ను గజ్వేల్‌లోని జీఎంఆర్‌పీ కళాశాలకు చెందిన విద్యార్థులు రూపొందించిన ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతి లభించింది. ఈ ప్రాజెక్టును కూడా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. మనిషి అవసరం లేకుండానే రిమోట్ సహాయంతో 360 డిగ్రీ ఫైర్ ఫైటర్ రోబో వాహనాన్ని దట్టమైన పొగలోకి పంపించి నీటిద్వారా అగ్నికీలల్ని అదుపు చేస్తుంది. దీపికారెడ్డి, నళిని గైడ్‌గా వ్యవహరించిన ఈ ప్రాజెక్టును విద్యార్థులు సూర్యప్రకాష్, అనిల్, అవినాష్, సంజయ్, నాగరాజు, జగదీష్ రూపొందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సువర్ణలతతోపాటు జీవీ రమేశ్‌కుమార్, చైతన్య, నర్సింహకుమార్, మధుకిరణ్, రాంరెడ్డిలు పాల్గొన్నారు.

# కుటుంబాన్నే మట్టుబెట్టాలని..

- ఆస్తి కోసం కార్తీక్‌రెడ్డి కుట్ర
- ఆన్‌లైన్‌లో ఐదు కత్తులు కొనుగోలు
- హత్య కేసును 12 గంటలలో ఛేదించిన కొల్లూరు పోలీసులు
- రిమాండ్‌కు నిందితుడి తరలింపు



దాడికి ఉపయోగించిన కత్తి



మృతురాలు రాధిక (ఫైల్)



నిందితుడు కార్తీక్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఆస్తి కోసం కన్న తల్లినే కిరాతకంగా హత్య చేసి అమ్మబంధాన్నే ప్రశ్నార్థకం చేశాడో తనయుడు. ఆస్తి పంచివ్వడం లేదని కక్ష పెంచుకుని కుటుంబ సభ్యులనే హతమార్చేందుకు కుట్రపన్నాడు సదరు ప్రబుద్ధుడు. డబ్బు వ్యామోహం, మాదక ద్రవ్యాల మత్తులో విచక్షణ సైతం కోల్పోయి కొడుకు బంధానికే మచ్చతెచ్చాడు కార్తీక్‌రెడ్డి. ఈ కేసును పోలీసులు 12 గంటల్లో ఛేదించారు. తల్లిని హత్య చేసిన కార్తీక్‌రెడ్డిని పోలీసులు సోమవారం సాయంత్రం అదుపులోకి తీసుకొని విచారించగా పలు విషయాలు వెల్లడయ్యాయి. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కార్తీక్‌రెడ్డి ఏడాదిన్నర కాలంగా తనకు రావాల్సిన ఆస్తి ఇవ్వాలని వ్యాపారం చేసుకుంటానని కుటుంబ సభ్యులతో నిత్యం గొడవపడుతుండేవాడు. మద్యానికి బానిసైన కార్తీక్‌రెడ్డి గోవా వెళ్లిన సమయంలో డ్రగ్స్ తీసుకునేవాడు. కుటుంబ సభ్యులు ఆస్తిని పంచడం లేదని వారిపై కక్ష పెంచుకున్నాడు. నెల రోజుల కిందట ఆన్‌లైన్‌లో 5 కత్తులను కొనుగోలు చేసి తన గదిలో భద్రపరుచుకున్నాడు. కొద్దిరోజులకు తనకు రావాల్సిన ఆస్తిను ఇవ్వాలని కుటుంబ సభ్యులను కత్తితో బెదిరించాడు. ఆ సమయంలో పెద్దలతో పంచాయితీ పెట్టి నచ్చజెప్పారు. అప్పటి నుంచి కార్తీక్‌రెడ్డి అదును కోసం వేచి చూస్తూ ఉన్నాడు. ఆదివారం రాత్రి శేరిలింగంపల్లి గోపనపల్లిలో నివాసం ఉండే స్నేహితుడికి ఫోన్ చేసి మద్యం తాగుదామని పిలిచాడు. స్నేహితుడితో కలిసి బీర్‌లు తీసుకొని తెల్లాపూర్‌లోని జీబ్లాక్ వద్దకు వెళ్లి మద్యం సేవించారు. ఆ సమయంలో తనకు త్వరలో డబ్బులు వస్తున్నాయని ఏ వ్యాపారం చేస్తే బాగుటుందని స్నేహితుడిని సలహా అడిగాడు. హాస్టల్ వ్యాపారం బాగుంటుందని సలహా ఇచ్చాడు. అదే సమయంలో అతడి స్నేహితుడికి ఫోన్ రావడంతో వెళ్లిపోయాడు. మిగిలిన బీర్‌లను తీసుకుని కార్తీక్‌రెడ్డి ఇంటికి వెళ్లిపోయాడు. అనంతరం తన వెంట తెచ్చుకున్న బీర్‌లతోపాటు ఇంట్లో తండ్రి తెచ్చుకుని పెట్టుకున్న మద్యం సైతం తాగాడు. తల్లి రాధిక, తండ్రి మల్లారెడ్డి కింద హాల్ పడుకోగా, కార్తీక్‌రెడ్డి తన గదిలోకి వెళ్లాడు. అన్న సందీప్ రెడ్డి దంపతులు మొదటి అంతస్తులో పడుకున్నారు. తెల్లవారుజాము 4.30గంటల సమయంలో తల్లి రాధిక నిద్ర నుంచి లేచి సోఫాలో కూర్చుంది. గదిలో నుంచి బయటకు వచ్చిన కార్తీక్‌రెడ్డి తల్లిపై కత్తితో దాడి చేశాడు. అది చూసిన తండ్రి మల్లారెడ్డి కత్తిని గుంజుకునే ప్రయత్నం చేయగా అతడిపై కూడా దాడి చేశాడు. కొడుకు చేతులోని కత్తిని గుంజుకుని మల్లారెడ్డి సెక్యూరిటీ వద్దకు పరుగులు తీశాడు. అదే సమయంలో గదిలో దాచుకున్న మరో కత్తిని తీసుకొని వచ్చి దాడి చేయబోయాడు. కత్తి పోట్లకు గురైన రాధిక ఇంట్లో నుంచి బయటకు వచ్చి రోడ్డుపై పడిపోయింది. బయటకు వచ్చిన కార్తీక్‌రెడ్డి అమ్మను ఆసుపత్రి తీసుకొని పోదాం రమ్మంటూ కేకలు వేశాడు. అక్కడికి తండ్రి వస్తే అతడిపై కూడా దాడి చేయడానికి సిద్ధం కావడంతో తండ్రి రాలేదు. పై గదిలో నుంచి కిందకు వచ్చిన అన్న వదినలు ఇది పద్ధతి కాదంటూ చెప్పడంతో వదిన మీరు మధ్యలోకి రావొద్దు ఇది మా సమస్య అంటూ బెదిరించాడు. భయంతో సందీప్‌రెడ్డి గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. అక్కడి నుంచి కార్తీక్‌రెడ్డి పరారయ్యాడు. సోమవారం సాయంత్రం తెల్లాపూర్ మేళ్ల చెరువు వద్ద ఉన్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటపడింది. పోలీసులు నిందితుడి వద్ద నుంచి 5 కత్తులను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం కార్తీక్‌రెడ్డిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

## సమాజసేవే లక్ష్యంగా పనిచేయాలి

- రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక
- డిస్ట్రిక్ గవర్నర్ శరత్‌చంద్రచౌదరి





మాట్లాడుతున్న డిస్ట్రిక్ గవర్నర్ శరత్‌చంద్రచౌదరి

సదాశివపేట(సంగారెడ్డి): విద్య, వైద్యం, పర్యావరణం వంటి అంశాలలో సమాజసేవే లక్ష్యంగా రోటరీ క్లబ్‌లు పనిచేయాలని రోటరీ క్లబ్‌ల డిస్ట్రిక్ గవర్నర్ శరత్‌చంద్రచౌదరి పేర్కొన్నారు. పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన రోటరీ క్లబ్ నూతన అధ్యక్ష కార్యవర్గ సభ్యుల ఎన్నిక, ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన పాల్గొన్నారు. అంతకుముందు సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో రూ. 3లక్షలతో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నూతన తరగతి గదుల నిర్మాణానికి సుమారు రూ.50 లక్షలతో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్మిస్తామన్నారు.

**నూతన కార్యవర్గం ఎన్నిక..**

అనంతరం సదాశివపేట రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా ప్రభు, ప్రధాన కార్యదర్శిగా అశోక్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా ప్రవీణ్‌కుమార్, మెంబర్‌షిప్ చైర్మన్‌గా చీలమల్లన్న ఎన్నికయ్యారు. ఫౌండేషన్ చైర్మన్‌గా డి.వినోద్‌కుమార్, సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా డా.చంద్రశేఖర్, సభ్యులుగా రాజాకుమారి, పురం రజనీ, శరత్‌చంద్ర, అన్నపూర్ణ, రాజు,నరేందర్, నాగరాజు, డాక్టర్ మాలతీలత, రామకృష్ణ, కృపాకర్, రామకృష్ణారెడ్డి, రాచన్నలు ఎన్నికై ప్రమాణస్వీకారం చేశారు.

## జేఎన్టీయూ కళాశాల విద్యార్థికి రజతం



పవిత్రాచారిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహ

సంగారెడ్డి: చండీగఢ్ యూనివర్సిటీలో నిర్వహించిన అఖిల భారత విశ్వవిద్యాలయాల ఉషూ మహిళల లీగ్ క్రీడాపోటీల్లో సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ కళాశాలకు చెందిన విద్యార్థిని పడకంటి పవిత్రాచారి రజత పతకం గెలుచుకుంది. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.నరసింహం మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. దేశవ్యాప్తంగా 131 విశ్వవిద్యాలయాల నుంచి సుమారు 1,500 మంది క్రీడాకారులు పోటీలలో పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా పవిత్రాచారిని క్రీడల విభాగం ఇన్‌చార్జి రజనీష్, జోషి శ్రీపాద, ప్రిన్సిపాల్ అభినందించారు.

## క్లుప్తంగా

### నిందితుడి రిమాండ్

నర్సాపూర్: పోలీసులపై చేయి చేసుకున్న ఘటనలో నిందితుడు సురేశ్‌ను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు పంపినట్లు స్థానిక ఎస్ఐ లింగం తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా తమ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు మోహన్, భిక్షపతి సోమవారం మండలంలోని మూసాపేట గ్రామానికి వెళ్లగా గ్రామానికి చెందిన సురేశ్ కానిస్టేబుళ్లను బూతులు తిట్టి చేయి చేసుకున్నాడని పేర్కొన్నారు. కానిస్టేబుళ్ల ఫిర్యాదు మేరకు నిందితుడు సురేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

### వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

**నిర్వాహకురాలితోపాటు విటుడు, మహిళ అదుపులోకి**

సిద్దిపేటఅర్బన్: వ్యభిచార గృహంపై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి విటుడు, మహిళతోపాటు నిర్వాహకురాలిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఎన్సాన్‌పల్లి గ్రామ శివారులో బాలరాజు యశోద అనే మహిళ తన ఇంటిలో కొంత కాలంగా వ్యభిచార దందా నిర్వహిస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడి చేయగా పాలమాకుల గ్రామానికి చెందిన విటుడు మోతే శేఖర్‌తోపాటు మరో మహిళను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,700 నగదు, మూడు సెల్‌ఫోన్స్, బైక్ స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

### ఇసుక డంప్ సీజ్

కొండపాక(గజ్వేల్): అక్రమంగా ఇసుకను డంప్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంకిరెడ్డిపల్లి గ్రామ శివారులో రేగులపల్లి పద్మారెడ్డి వ్యవసాయ బావి కొంత కాలంగా దండుగుల కనకయ్య రహస్య ప్రదేశంలో అక్రమంగా ఇసుకను డంప్ చేసుకుంటూ ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు, త్రీ టౌన్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోదాలు చేసి 30 టన్నుల ఇసుక డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటరెడ్డి కథనం మేరకు.. కుత్బుల్లాపూర్‌కు చెందిన వేణు(38) హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీస్‌లో రుణ రికవరీ ఏజెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం సంగారెడ్డి నుంచి హైదరాబాద్ వైపు బైక్‌పై వెళ్తున్నాడు. ఇస్నాపూర్ సాంఘీక సంక్షేమ గురుకుల వసతి గృహం సమీపంలో జాతీయ రహదారి మధ్యలో ఉన్న డివైడర్ ఢీకొట్టాడు. అనంతరం అటు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక చక్రానికి తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే పటాన్ చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ సుల్తాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్

జిన్నారం (పటాన్‌చెరు): మహిళ హత్య కేసులో గుమ్మడిదల పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం కేసుకు సంబంధించిన వివరాలను గుమ్మడిదల పోలీసులు వెల్లడించారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం బిక్య తండాకు చెందిన గుగులోత్ పూర్య (52) కౌడిపల్లి మండలం కన్నారం తండా కేతావత్ ముని అనే మహిళను డిసెంబర్ 12న గుమ్మడిదల కల్లు కాంపౌండ్ వద్ద మాయమాటలు చెప్పి నల్లవల్లి అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లాడు. అనంతరం మహిళను అత్యాచారం చేయడమే కాకుండా చున్నీతో మెడకు ఉరి వేసి దారుణంగా హత్య చేశాడు. కేసు దర్యాప్తులో భాగంగా ఈనెల 4న సీసీ కెమెరాల సహాయంతో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు జిన్నారం సీఐ నయీముద్దీన్ తెలిపారు. హత్య కేసును ఛేదించిన ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి హెడ్ కానిస్టేబుల్ వెంకటేశం, సికిందర్, కిషోర్, కానిస్టేబుల్ సాయి వర్ధన్ రెడ్డిలను, జిన్నారం సీఐ నయీముద్దీన్ ప్రత్యేకంగా అభినందించారు.



# అగ్గి రాజుకుంటే బుగ్గేనా...!

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- శిథిలావస్థలో భవనాలు
- నీటి వసతి అంతంతే
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆందోళనకర పరిస్థితులు
- ప్రారంభమైన వేసవి కాలం
- ప్రమాదాలు జరిగితే నివారించడం కష్టమే

## సమస్యల నడుమ అగ్నిమాపక కేంద్రాలు



సాక్షి విజిట్

వేసవి నేపథ్యంలో అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయి. అయితే సిబ్బంది వెళ్లి మంటలార్పి ప్రమాద స్థాయిని తగ్గించాల్సి ఉంటుంది. ఇందుకుగాను సరైన సిబ్బంది, నీటి వసతి అవసరం. కానీ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఫైర్‌స్టేషన్‌లో సరైన వసతులు లేక ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. సిబ్బంది పూర్తి స్థాయిలో లేక ఖాళీలు దర్శనమిస్తున్నాయి. పై స్థాయి అధికారి నుంచి కింది స్థాయి వరకు సిబ్బంది లేరు. అలాగే అగ్రిమాపక కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల ఉన్న భవనాలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. అరకొర వసతుల నడుమే సిబ్బంది విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటి వసతి అంతంత మాత్రంగానే ఉంది. అధికారులు చర్యలు చేపట్టి అగ్నిమాపక కేంద్రాల్లో సరైన వసతులు కల్పిస్తేనే ప్రమాదాలు నివారించవచ్చు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అగ్నిమాపక కేంద్రాల్లో ఉన్న వసతులు, పరిస్థితులపై 'సాక్షి' ప్రత్యేక కథనం.



తాత్కాలిక భవనంలో కొనసాగుతున్న అగ్నిమాపక కేంద్రం

### అరకొరగా సిబ్బంది

గజ్వేల్: గజ్వేల్‌లోని అగ్నిమాపక కేంద్రం సిబ్బంది కొరతతో కొట్టుమిట్టాడుతోంది. నియోజకవర్గంలోని గజ్వేల్, ములుగు, వర్గల్, జగదేవ్‌పూర్, కొండపాక, కుకునూర్‌పల్లి మండలాల్లోని ప్రజల అవసరాల కోసం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ 34 మంది సిబ్బంది పనిచేయాల్సి ఉండగా, కేవలం 12 మంది మాత్రమే ఉన్నారు. అత్యంత కీలకమైన ఈ కేంద్రానికి సొంత భవనం ఏళ్ల తరబడి కలగానే మిగిలింది. ప్రస్తుతం తూప్రాన్ రోడ్డు వైపున గల ప్రాంతీయ జీవనోపాదుల వనరుల శిక్షణ కేంద్రంలో తాత్కాలికంగా కొనసాగుతుంది. మూడు యంత్రాలు అందుబాటులో ఉన్నా.. సింగిల్ ఫేజ్ బోరు మాత్రమే ఉంది. దీని వల్ల సకాలంలోని నీటిని నింపుకొని వెళ్లడం ఇబ్బందిగా మారుతోంది. వెంటనే ఇక్కడ త్రీఫేజ్ మోటార్ బోరు బిగించాల్సి ఉంది. అంతేకాకుండా సిబ్బంది కొరత తీర్చి, సొంత భవనం ఏర్పాటు చేస్తేనే వేగవంతమైన సేవలు అందే అవకాశముంది.

### సంసిద్ధమే.. బొల్లారంలో సమస్యాత్మకం

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో బీహెచ్ఈఎల్, బీడీఎల్ పాశ మైలారం, పటాన్‌చెరులో అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. పాశమైలారం పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి ఎప్పటికప్పుడూ శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతుంటాయి. పారిశ్రామిక వేత్తలు సహకారంతో అక్కడ అగ్నిమాపక శకట నిర్వహణ కొనసాగుతుంది. బీహెచ్ఈఎల్‌లో రెండు, పటాన్‌చెరులో రెండు, పాశమైలారంలో ఒకటి అగ్నిమాపక శకటాలు ఉన్నాయి. అందుకు సరిపడా సిబ్బంది ఉన్నారు. అయితే కొన్ని సందర్భాల్లో ఎద్దుమైలారం నుంచి అగ్నిమాపక శకటాలను రప్పిస్తారు.

**బొల్లారంలో ఇబ్బందికర పరిస్థితి**

జిన్నారం, గుమ్మడిదల, బొల్లారంలో అగ్నిమాపక కేంద్రాలు లేవు. పెరిగిన జనాభా, కాలనీలకు అందుబాటులో అగ్నిమాపక కేంద్రాలు కావాలి. బొల్లారంలో అగ్నిమాపక కేంద్రం కావాలని చాలా కాలంగా కోరుతున్నారు. ప్రైవేటు సంస్థల సహకారంతో ప్రమాదాలను నియంత్రిస్తున్నారు. బొల్లారంలో పారిశ్రామిక వాడలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడల్లా హెట్రో పరిశ్రమ, లేదా రెడ్డి ల్యాబ్స్ అగ్నిమాపక సిబ్బందితో ప్రమాదాలను అదుపులోకి తీసుకొస్తున్నారు.




పటాన్‌చెరులో అగ్నిమాపక కేంద్రం

### శిథిల భవనంలో అగ్నిమాపక కేంద్రం

నారాయణఖేడ్: శిథిల భవనంలో సరైన సదుపాయాలు లేక ఖేడ్ అగ్ని మాపక కేంద్రం నిర్వహణ ఇబ్బంది కరంగా మారింది. ఖేడ్‌లో 2004లో అగ్నిమాపక కేంద్రం మంజూరైంది. అప్పటి నుంచి ఇప్పటివరకు శిథిలంగా ఉన్న పంచాయతీరాజ్ గోడౌన్ భవనంలోనే కార్యాలయం కొనసాగుతుంది. భవనం పెచ్చులూడుతూ కూలేందుకు సిద్ధంగా ఉంది. నీటి వసతి కోసం బోరు లేకపోవడంతో 5 కిలోమీటర్ల దూరంలోని కమలాపూర్ చెరువులోంచి నీటిని నింపుకొని ప్రమాదాల నివారణకు వెళ్తున్నారు. ఏడు మండలాలైన ఖేడ్, కంగ్టి, సిర్గాపూర్, కల్హేర్, నిజాంపేట, నాగల్‌గిద్ద, మనూరు ఈ అగ్నిమాపక కేంద్రం పరిధి కిందకు వస్తాయి. నూతన భవనం నిర్మాణానికి రూ.1.20 కోట్లు మంజూరు అయ్యాయి. ఈ నిధులతో భవన నిర్మాణం, బోరు, ట్యాంకు నిర్మాణం చేపట్టనున్నారు. అప్పటివరకు ఇబ్బందులు తప్పేలా లేవు.



పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం

### సమృద్ధిగా నీరు

మెదక్‌జోన్: మెదక్ జిల్లా కేంద్రంలో మూడు అగ్ని మాపక శకటాలు ఉండగా, వాటిలో ఒకటి పాడైపోయింది. దానికి మరమ్మతులు చేయాల్సి ఉంది. ప్రస్తుతం రెండు శకటాలను ఉపయోగిస్తున్నారు. అలాగే జిల్లా అధికారితో పాటు 16 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా 14 మంది ఉన్నారు. ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంది. అగ్నిమాపకశాఖ ఆవరణలోనే బోరు ఉంది. నీటి నిల్వకోసం కుండీలను నిర్మించగా నీరు సమృద్ధిగా ఉంది.

### ఫైర్ స్టేషన్‌లో నర్సా'పూర్'

నర్సాపూర్: నర్సాపూర్‌లోని అగ్నిమాపక కేంద్రంలో సమస్యలు తిష్ట వేశాయి. రెండు ఫైరింజన్లు ఉండగా ఒకే షెడ్డు ఉండటంతో ఒక దానిని బయటే పెడుతున్నారు. ఫైర్ స్టేషన్‌కు ఆఫీసు భవనంతో పాటు ఇక్కడ పని చేసే సిబ్బందికి రెస్ట్ రూమ్ ఇతర వసతులకు శాశ్వత భవనం లేనందున ఫైరింజన్ షెడ్డు పక్కన ఉన్న చిన్న పాటి ఇరుకైన గదినే ఉద్యోగులు విశ్రాంతి తీసుకోవడానికి వినియోగిస్తున్నారు. ఫైర్ స్టేషన్‌లో పని చేసే కొందరు ఉద్యోగులు డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో వారి పోస్టులతోపాటు ఒక లీడింగ్ ఫైర్‌మెన్, డ్రైవర్ పోస్టు ఖాళీగా ఉంది. పది మంది ఫైర్‌మెన్లు ఉండాల్సి ఉండగా ఒక్కరే ఉండగా 9 ఖాళీలు న్నాయి. ఫైర్‌మెన్ల ఖాళీలు భర్తీ చేయలేని ఉన్నతాధికారులు వారి స్థానంలో 10 మంది హోంగార్డులతో విధులు చేయిస్తూ ఫైర్ స్టేషన్‌ను కొనసాగిస్తున్నారు.



షెడ్డులో స్థలం లేక ఎండలో ఉన్న ఫైరింజన్

### మార్కెట్ యార్డులో ఫైర్‌స్టేషన్

దుబ్బాక: దుబ్బాకలో అగ్నిమాపక కేంద్రంకు సొంత భవనం లేకపోవడంతో వ్యవసాయ మార్కెట్ యార్డులోనే ఎనిమిదేళ్లుగా కొనసాగుతుంది. మార్కెట్‌యార్డ్‌లోని రేకుల షెడ్ నుంచే ఫైర్‌స్టేషన్ నిర్వహణ చేస్తున్నారు. ఫైర్‌స్టేషన్ భవనం నిర్మాణం కోసం చీకోడ్ రోడ్‌లో స్థలం సిద్ధంగా ఉన్నప్పటికీ నిధులు మంజూరు చేయకపోవడంతో అరకొర సౌకర్యాలతోనే ఫైర్‌స్టేషన్ కొనసాగుతుంది. మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరిగినన్ని రోజులు ఫైర్ సిబ్బందికి చాలా ఇబ్బందిగా తయారైంది. ఫైర్ స్టేషన్‌లో అధునాతన టెక్నాలజీతో కూడిన 4,500 లీటర్ల సామర్థ్యంతో కూడిన ఫైరింజన్ వాహనం ఉంది. ఫైరింగ్ స్టేషన్ ఆఫీసర్‌తో పాటు మొత్తం 16 మంది సిబ్బంది ఉన్నారు. కేవలం ఒక ఫైర్‌మెన్ పోస్టు ఖాళీగా ఉంది. ఫైరింజన్‌లోకి వాటర్‌ను లచ్చపేట రోడ్‌లో బోర్ వద్ద నింపుకోవాల్సి వస్తుంది. కొత్తగా సొంతభవనం నిర్మిస్తే ఇబ్బందులు తీరుతాయి.



దుబ్బాక మార్కెట్ యార్డులో ఉన్న ఫైరింజన్

**అన్ని విధాలుగా సిద్ధం**



వేసవి కాలంలో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయి దీని కోసం ముందుగానే అన్ని విధాలుగా జాగ్రత్త చర్యలతో సిద్ధంగా ఉన్నాం. సొంత భవనం లేక ఇబ్బంది తప్ప సిబ్బందితో పాటు అధునాతనమైన ఫైరింజన్ సౌకర్యంతోపాటు అన్ని బాగానే ఉన్నాయి.

\- కమలాకర్, దుబ్బాక అగ్నిమాపక అధికారి

### పరిధి ఎక్కువ.. ఫైర్ ఇంజన్లు తక్కువ

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ కేంద్రం పరిధిలో జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, ఝరాసంగం, రాయికోడ్, కోహీర్ మండలాలు ఉన్నాయి. జహీరాబాద్ డివిజన్ పరిధి పెద్దగా ఉండడంతో తరుచుగా ఏదో ఒక చోట ప్రమాదాలు సంభవించి ఆస్తి నష్టం జరుగుతుంది. ముఖ్యంగా చెరుకు తోటల్లో అగ్నిప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల జహీరాబాద్ మొగుడంపల్లి, న్యాల్‌కల్ మండలాల్లో అగ్నిప్రమాదాలు సంభవించి పదుల ఎకరాల్లో పంట దగ్ధమైంది. అగ్నిమాపక కేంద్రంలో ఫైర్ ఇంజన్ మాత్రం ఒక్కటే ఉంది. పాత ఇంజన్ పాడైపోవడంతో కొత్త అగ్నిమాపక యంత్రం వచ్చింది. అ లాగే సిబ్బంది కొరత వేధిస్తుంది. పది మంది ఫైర్‌మెన్‌లు ఉండాలి కానీ ప్రస్తుతం నలుగురే ఉన్నారు. మూడు డ్రైవర్ పోస్టులు ఉండగా ఒక పోస్టు ఖాళీగా ఉంది. ర్ ఆఫీసర్ పోస్టుకు ఖాళీగానే ఉంది. అగ్నిమాపక కేంద్రంలోనిసేఫ్టీ పరికరాలు పాతబడడంతో వాటి స్థానంలో కొత్తవి వచ్చాయి.



జహీరాబాద్ అగ్నిమాపక కేంద్రంలో ఫైర్ ఇంజన్

### వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువ

- సిద్దిపేట ఇన్‌చార్జి ఫైర్ అధికారి నర్సింలు



సిద్దిపేటకమాన్: వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని సిద్దిపేట ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జి అధికారి నర్సింలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే సమాచారం అందించాలని ఫైర్ సిబ్బంది అప్రమత్తంగా ఉన్నట్లు తెలిపారు. సిద్దిపేట ఫైర్ స్టేషన్‌లో ఒక మల్టీపర్పస్ టెండర్ వెహికిల్ అందుబాటులో ఉందని తెలిపారు. ఈ వాహనంలో 4,500 లీటర్ల నీటి సామర్థ్యం, 500 లీటర్ల ఫోమ్ ఉంటుందని తెలిపారు. సిద్దిపేట ఫైర్ స్టేషన్‌లో ఒక అధికారి, ఒక హెడ్ కానిస్టేబుల్, ఆరుగురు కానిస్టేబుళ్లు, ముగ్గురు డ్రైవర్లతో కలిపి మొత్తం 11 మంది సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ ఏడాది 26 అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నాయన్నారు.



సిద్దిపేట ఫైర్ స్టేషన్‌లో వాహనాలు

### మిషన్ భగీరథ నీళ్లే దిక్కు

జోగిపేట(అందోల్): అందోలు నియోజకవర్గ కేంద్రమైన జోగిపేట పట్టణంలోని ఫైర్ స్టేషన్‌లో ఇద్దరు డ్రైవర్లు, ముగ్గురు ఫైర్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న ఒక్క డ్రైవర్ ఎస్ఐ ట్రైనింగ్‌కు వెళ్లాడు. ప్రస్తుతం నారాయణఖేడ్‌కు చెందిన డ్రైవర్ డిప్యూటేషన్‌పై పని చేస్తున్నాడు. చాలా కాలంగా ఫైర్ ఇంజన్ పనిచేయని పరిస్థితికి రావడంతో ఇటీవల జహీరాబాద్‌లోని ఫైర్ ఇంజన్‌ను జోగిపేట స్టేషన్‌కు పంపారు. ఇప్పటి వరకు వాహనంను అధికారికంగా అప్పగించలేదన్నది సమాచారం. స్టేషన్‌కు అవసరమైన నీటి కోసం వేసిన బోరు నీటిలో డ్రైనేజీ నీరు కలిసి కలుషితం కావడంతో దుర్గంధం వస్తుంది. వాటిని వినియోగించకుండా మున్సిపల్ అధికారులతో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ తీసుకున్నట్లు ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.



జోగిపేట ఫైర్ స్టేషన్

### కేంద్రం మంజూరు.. స్థలం కరువు

తూప్రాన్: తూప్రాన్ డివిజన్ కేంద్రానికి అగ్నిమాపక కేంద్రాన్ని రెండేళ్ల కిందట ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ అధికారులు స్థలం కేటాయింపు చేయకపోవడంతో కేంద్రం ఏర్పాటు కావడం లేదు. తూప్రాన్ ఉమ్మడి మండలంలో పారిశ్రామిక వాడలు అధికంగా ఉన్నాయి. ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే సకాలంలో అగ్నిమాపక కేంద్రాలు అందుబాటులో లేని కారణంగా రూ.కోట్లలో ఆస్తి నష్టం జరుగుతోంది. ఏదైనా అగ్ని ప్రమాదం జరిగినప్పుడు గజ్వేల్, రామాయంపేట, నర్సాపూర్ అగ్నిమాపక కేంద్రాల నుంచి వాహనాలు రావాల్సిన దుస్థితి నెలకొంది. గంటలకు పైగా జాప్యం జరగడంతో అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అగ్నిమాపక కేంద్రాన్నికి స్థలం కేటాయింపు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### డ్రైవర్ల కొరత

రామాయంపేట(మెదక్): రామాయంపేట ఫైర్ స్టేషన్ (అవుట్ పోస్టు)లో సిబ్బంది కొరత నెలకొంది. మొత్తం 16 మంది సిబ్బందికి ముగ్గురిని డిప్యూటేషన్‌పై మెదక్ పంపించారు. ఇక్కడ కేవలం 13 మంది మాత్రమే పని చేస్తున్నారు. వీరిలో ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులు, 11 మంది హోంగార్డులున్నారు. ఫైర్ ఇంజన్ తోలడానికిగాను ఇద్దరు ప్రత్యేకంగా డ్రైవర్లను నియమించాల్సి ఉండగా, హోంగార్డులే బండి తోలుతున్నారు. వర్షాకాలంలో షెడ్డు ఉరుస్తుండటంతో సిబ్బంది ఇబ్బందులపాలవుతున్నారు.



రామాయంపేట ఫైర్ స్టేషన్

## పోటీలతో ప్రతిభ పెరుగుతోంది

- మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ భవానీ
- జిల్లాస్థాయి సాంకేతిక పోటీలు

మెదక్ కలెక్టరేట్: విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను వెలికి తీసేందుకు ప్రతీ సంవత్సరం ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ భవానీ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సృజనా టెక్‌ఫెస్ట్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, జహీరాబాద్ కళాశాలల విద్యార్థులు గ్రూపులుగా పాల్గొని తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. పోటీల్లో ఉత్తమ సాంకేతికతో ప్రాజెక్ట్ రూపొందించిన సిద్దిపేట పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భవానీ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో మొత్తం 10 పాలిటెక్నిక్ కళాశాలలు ఉండగా సివిల్ సబ్జెక్ట్ ఉన్న కళాశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలతో విద్యార్థుల్లో ప్రతిభ పెరుగుతుందన్నారు. ప్రతిభ కనబర్చిన సిద్దిపేట విద్యార్థులకు బహుమతి అందజేసిన ప్రిన్సిపాల్ వారిని అభినందించారు. కార్యక్రమంలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ బీవీ సుబ్బయ్య, సృజనా టెక్ ఫెస్ట్ ప్రతినిధులు భరత్‌కుమార్, నరేశ్, మెదక్ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు శ్రీనివాస్, భవానీ కుమార్, స్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన సిద్దిపేట కళాశాల విద్యార్థులు

## రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తల మృతి

అల్లాదుర్గం(మెదక్): రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని పల్లేగడ్డ (కుసంబీనగర్) శివారులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం.. అల్లాదుర్గం గ్రామానికి చెందిన బండ సాయిలు(55), మాణె మ్మ(50) భార్యాభర్తలు. వారంతపు సంతలో కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. టేక్మాల్ మండలం బోడ్మట్‌పల్లి సంతలో కూరగాయలు విక్రయించడానికి ఇద్దరూ లూనాపై వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా జాతీయ రహదారిపై అల్లాదుర్గం నుంచి జోగిపేట వైపు వెళ్తున్న కారు అతివేగంగా ఢీకొన్నది. ఈ ప్రమాదంలో దంపతులిద్దరికి తీవ్ర గాయాలై ప్రాణాలొదిరారు. ఘటనా స్థలాన్ని అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.



సాయిలు (ఫైల్)



మాణెమ్మ (ఫైల్)

### ప్రశాంత వాతావరణంలో పరీక్షల నిర్వహణ

మెదక్‌జోన్: ఇంటర్మీడియెట్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం, వైద్య శిబిరం, ఫ్యాన్లు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. విద్యార్థులు పరీక్ష సమయాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, జిరాక్స్ సెంటర్లను మూసి వేయించామన్నారు.

## ఏడుపాయల దొంగలు అరెస్ట్

**ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి**

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల్లో జరుగుతున్న దొంగతనాలకు సంబంధించి ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంత కాలంగా ఏడుపాయల్లో జరుగుతున్న దొంగతనాలకు సంబంధించి వడ్డె యాదయ్య, మక్కని నవీన్, ఉప్పు సాయికుమార్, అలకుంట నరేశ్, మక్కని పవన్, వడ్డె శ్రీకాంత్, వడ్డె నర్సింలును అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.8 లక్షల విలువ చేసే 121 గ్రాముల బంగారు ఆభరణాలు, దొంగతనానికి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. దొంగల అరెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన సీఐ రాజశేఖర్ రెడ్డి, ఇంటలీ జెన్స్ సీఐ రాజిరెడ్డి, పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, ఏఎస్ఐ సంగన్న, గాలయ్య, కానిస్టేబుళ్లకు రివార్డులు అందజేశారు.



మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

## చిరుతకు కుక్క ఎర

**బంధించడానికి బోను ఏర్పాటు**

రామాయంపేట(మెదక్): రామాయంపేట పట్టణ శివారులో సంచరిస్తున్న చిరుతను బంధించడానికి అటవీశాఖ అధికారులు మంగళవారం బోను ఏర్పాటు చేశారు. చిరుత సంచరించే ప్రాంతంలో సర్వయకుంట సమీపంలో బోను ఏర్పాటు చేసిన అధికారులు.. ఎరగా అందులో కుక్కను ఉంచారు. సమీపంలోని చెట్లకు సీసీ కెమెరాలు అమర్చారు. రైతులు సర్వయకుంట ప్రాంతానికి వెళ్లవద్దని అధికారులు సూచించారు.



చిరుతను బంధించడానికి ఏర్పాటు చేసిన బోను